ప్రజాశక్తి
ఆదివారం 25 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



త్వరితగతిన భూముల రీ సర్వే

ప్రజాశక్తి-జిమాడుగుల:మండలంలో బీరం పంచాయతీ నూరుమామిడి గ్రామాన్ని శనివారం పాడేరు ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజుకు 40 ఎకరాలు భూమి రీ సర్వే చేయాలని తహశీల్దార్ అప్పలస్వామికి సూచించారు. సర్వేకు వచ్చినపుడు అధికారులకు రైతులందరూ సహకరించాలన్నారు. తమ సరిహద్దుల్లో వద్ద ఉన్న జంగిల్సను తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామన్న దొర, సాయి, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పిఒ

గిరిజనులకు నష్టం చేకూర్చే...
హైడ్రో పవర్ ప్రాజెక్టుపై పోరాటం

▸▸ రాజకీయ ప్రయోజనాల కోసమే అనుమతులు మంజూరు ▸▸ సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ▸▸ ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ బృందం పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి:గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిరాకాన్ని అడ్డుకుంటామని, దీనిపై పోరాటం చేస్తామని అల్లూరి సీతారామరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత అటవీ ప్రాంతాన్ని, గ్రామాలను పరిశీలించారు. చిటంపాడు, డి.కంభవలస, నందనపురం, కొత్తవలస తదితర గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. అనంతరం అల్లూరి సీతారామరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలను ఉల్లంఘించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టును కార్పొరేట్ సంస్థలైన అదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి మంజూరు చేయడం తమ రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఏళ్లతరబడి ఆదివాసులు నివసిస్తున్నారని, ప్రాజెక్ట్ నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు చింత, పనస, జీడీ మామిడి, సీతాఫలం వంటి అటవీ ఉత్పత్తులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పీసా చట్టం, పంచాయతీ గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి తీర్మానం లేకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధం అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు కేటాయించడాన్ని వ్యతిరేకించాలని గిరిజనులకు పిలుపునిచ్చారు.



హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తున్న అప్పలనర్స, జెడ్పిటిసి గంగరాజు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

చట్టాలు ఉల్లంఘన : గంగరాజు

జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘించి నరేంద్ర మోడి, జగన్మోహన్ రెడ్డిలు కలిసి కార్పొరేట్ సంస్థలకు గిరిజనుల భూములు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి ఒక్క గిరిజనుడు పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పెదకోట పంచాయతీ కుడియా, గుమ్మకోట పంచాయతీ పరిధిలో గుజ్జెలి గ్రామాల్లో కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.బాలదేవ్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సీదేరి కొండలరావు, సీపీఎం నాయకులు గెమ్మెలి. దేవన్న, భీమరాజు, చిట్టంపాడు వాటర్ ఫాల్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు సమర్థి లక్ష్మణ్, అప్పన్న, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు. దొన్ను, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



కిండంగిలో గిరిజనులతో మాట్లాడుతున్న లోతా రామారావు

కిండంగిలో మౌలిక వసతులు కల్పించాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు


ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న లోదొడ్డి పంచాయతీ పర్వత ప్రాంతమైన కిండంగి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సంఘం నాయకులు కిండంగి గ్రామంలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు పలు సమస్యలను గిరిజన సంఘం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ గ్రామానికి విద్యుత్ సదుపాయం లేక గిరిజనులు రాత్రి వేళ చీకటిలోనే బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి రహదారి సౌకర్యం, తాగునీరు సౌకర్యం లేక గిరిజనులు ఐదు కిలోమీటర్లు నడకే శరణ్యమని పేర్కొన్నారు. గ్రామ శివారులో ఉన్న చెలమనీటిని గిరిజనులు సేవించవలసి వస్తుందన్నారు. గిరిజనులు అనారోగ్యం బారిన పడితే వైద్య సహాయం కోసం 5 కిలోమీటర్లు కొండ దిగివచ్చి, 25కిలోమీటర్లు ఆటోలో జడ్డంగి వెళ్లాల్సివచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5న నిండు గర్భిణికి పురిటి నొప్పులు వస్తే అర్ధరాత్రి 12 గంటలకు 5 కిలోమీటర్లు గిరిజనులు జోలకట్టి తీసుకొని రావలసిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఉన్నత అధికారులు గ్రామంలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల సహాయ కార్యదర్శి జర్త రాజబాబు, గెమ్మెల రంగారావు, గెమ్మెల లింగ్, చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-హుకుంపేట:విద్యాభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు 1లో సమావేశంను మండల విద్యాశాఖ అధికారి ఎస్ రామసుందర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ట్యాబులను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాడు నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. మండలంలో 787 మంది విద్యార్థులకు గాను 60 ట్యాబులను పంపిణీ చేశామని, మిగతా వాటిని ఆయా పాఠశాలలకు అందజేస్తామన్నారు.విద్యా వ్యవస్థను మెరుగు పరచాలనే ఉద్దేశంతో విద్యార్థులకు చాలా రకాలుగా పథకాలు ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు.విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఏజెన్సీ ప్రాంతానికి ఎంతో మేలు జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కమిషన్ సభ్యురాలు జంపరింగి లిల్లీ, ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పిటిసి రేగం మత్యలింగం, ఎంపీడీవో ఆర్.వెంకటరమణ, ఎంఈఓ ఎస్.రామచంద్రరావు, స్థానిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాంబాబు, సర్పంచులు, వైసిపి నేతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి -జి.మాడుగుల:పాడేరు నుండి జి.మాడుగుల రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, చెత్తను పంచాయతీ సిబ్బంది ఏరివేశారు. జీ.మాడుగుల పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌తో చెత్తను మండల కేంద్రంలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రమేష్, పంచాయతీ సెక్రటరీ నవీన్ దొర పాల్గొన్నారు.



చెత్తను ఏరివేస్తున్న సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల విద్యాబోధన ఉండాలని జిల్లా విద్యాశాఖధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఈఓ కె.తాతబ్బాయిదొర ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు అక్షరాలపై పూర్తి అవగాహన వచ్చేలా ఉపాధ్యాయుల శ్రద్ధ చూపాలన్నారు. బోధన మెళుకువలు ఉపాధ్యాయులు తెలుసుకొని, బోధనతీరులో క్రమంగా మార్పులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా విద్యాబోధన ఉండాలన్నారు. విద్యార్థులకు కనీసం సరళపదాలతో ఆంగ్లంలో చదవడం, రాయడంపై ఆసక్తిని కలిగించాలన్నారు. విద్యార్థులలో కనీస మార్పులు కనిపించకపోతే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఆర్పీలు విష్ణు, శ్రీను, పలు పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

- జెసి శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని, వైఎస్ఆర్ ఫించన్ దారులకు ఇస్తున్న నోటీసులపై అపోహలు వద్దని జిల్లా సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు స్పష్టం చేసారు. శనివారం ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య అమరావతి నుండి కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జెసి మాట్లాడుతూ,జిల్లాలో ఈ జనవరి నుండి కొత్తగా 5,398 మందికి పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా పింఛను పొందుతున్న 3,905 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వారు అర్హతలకు తగిన ఆధారాలు సమర్పిస్తే పింఛన్ పునరుద్ధరించటం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా జిల్లాలో 1,513 మంది లబ్దిదారులకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని, లబ్దిదారులు ఈ నెల 26వ తేదీలోపు సంబంధిత సచివాలయంకు వెళ్లి, వాలంటీర్ వద్ద బయో మెట్రిక్ వేయాలన్నారు. ప్రధానమంత్రి గరీభ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమైందని, ఇప్పటివరకు కందిపప్పు, పంచదార తీసుకోని వారు ఈ నెలాఖరు వరకు తీసుకోవచ్చని జేసి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు : గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టి, పాడేరు ఐటీడీఏ పిఒను తక్షణమే బదిలీ చేయాలని ఐటిడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 6వ రోజు కొనసాగాయి. ఈ రిలే నిరాహార దీక్షలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు జంపరంగి ఆనంద్, మాతృభాష విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కార్యదర్శి నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పాంగి శ్రీను పాల్గొని మాట్లాడుతూ, వీరి పోరాటానికి అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు కూడా కలిసి రావాలన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో వైఖరిని ప్రతి ఒక్కరు ఎండగట్టాలని, ఇలాంటి అధికారులతో , గిరిజన ప్రాంత అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ. కో కన్వీనర్లు ముప్వాళ లక్ష్మణరావు, బత్తిరి నరేష్, కదేలి చంటిబాబు, చిన్నారావు, కంబిడి లత కుమారి, బి.వరలక్ష్మి, మాణిక్యం, రావణ్, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టిబాబు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలు కిటకిట

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలు శనివారం కిటకిటలాడాయి. అనంతగిరి ఘాట్ రోడ్ నుంచి అరకు వరకు వాహనాల రద్దీ ఏర్పడింది. బొర్రా గుహలు మరింతగా కిటకిటలాడాయి. శివలింగాపురం, డముకు, యు ఫాయింట్, చిట్టంపాడు, కటికి జలపాతాల వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ కాఫీ, ఇతర వస్తువులను కొనుగోలు చేశారు.అరకు పద్మాపురం గార్డెన్, ట్రైబల్ మ్యూజియం వంటి ప్రాంతాలను తిలకించారు. అరకు, అనంతగిరి ఘాట్ రోడ్డులోని పలు ప్రాంతాలలో వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.

పోడు సాగుదారులపై దాడులు ఆపాలి

సిపిఎం మండల కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-చింతూరు

దశాబ్దాలుగా పోడు భూముల సాగు చేస్తున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు వేధింపులు ఆపాలని, ప్రభుత్వం తక్షణమే సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఏడుగురాళ్లపల్లిలో పోడు భూముల సాగుదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అనేక దశాబ్దాలుగా హక్కు పత్రాలు లేకున్నా ఈ ప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. హక్కు పత్రాల కోసం అనేక పోరాటాల ఫలితంగా 2005 అటవీ హక్కుల చట్టం సాధించారని, కానీ నేటికీ సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఫారెస్ట్ అధికారులను ఉసిగొలుపుతుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై పక్షపాత వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టంను పటిష్టంగా అమలు పరచకుండా నూతన అటవీ విధానంతో అడవులను, ఖనిజ సంపదను సహజ వనరులను చట్ట విరుద్ధంగా కార్పొరేట్లకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, వ్యాకరాజ్ కుమార్, సవలం ముత్తయ్య, సవలం దేశయ్య, కన్నారావు, చంద్రయ్య, కట్టం చుక్కమ్మ, కనితి, మారమ్మ సవలం, వెంకటేష్, సోలం, రాజులు సవలం, శ్రీను కనితి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్



మాట్లాడుతున్న ఐద్వా మండల అధ్యక్షులు కారం లక్ష్మి

మహిళలకు బహుముఖ పోటీలు

- ఐద్వా నాయకులు కారం లక్ష్మి, సున్నం పార్వతి

ప్రజాశక్తి-విఆర్.పురం

క్రిస్మస్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, రేలా డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శి కారం లక్ష్మి, సున్నం పార్వతి తెలిపారు. వీటిల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాని జయప్రదం చేయాలని కోరారు. శనివారం రేఖపల్లిలో జరిగిన ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా ఏర్పడిన ఐద్వా నిత్యం మహిళల సమస్యలపై పోరాడుతుందని చెప్పారు. మహిళలపై జరుగుతున్న దాడులు, సాంఘిక దురాచారాలపై ఉద్యమిస్తుందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎన్.అశ్విని, దారమ్మ, వెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఈ ఏడాది పునరుద్ధరించాలని స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని జీకే వీధి మండల కేంద్రానికి తరలించడంతో ఇక్కడి విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే జీకే వీధి మండల కేంద్రానికి 50 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి ఉందన్నారు. రహదారి సీలేరు నుంచి జీకే వీధి వరకు అస్తవ్యస్తంగా ఉండడంతో ఇతర వాహనాలపై వెళ్లాలంటే ప్రయాణం తలకిమించిన భారంగా తయారైందని వాపోయారు. పాడేరు డిపోకు చెందిన బస్సు సర్వీస్ సీలేరులో తెల్లవారుజామున నాలుగు గంటలకు ఒకటే ఉందని, ఆ బస్సు మిస్ అయితే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. తర్వాత సీలేరు నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి సకాలంలో బస్సు సౌకర్యం లేదన్నారు. దీంతో విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఈ ఏడాది సీలేరులో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వీరరాఘవులు ఆశయ సాధనే నిజమైన నివాళి

ప్రజాశక్తి-ఎటపాక

కామ్రేడ్ కాటిబోయిన వీర రాఘవులు ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి ఐవి అన్నారు. మండలంలోని చింతలగూడెం గ్రామంలో కామ్రేడ్ కాటిబోయిన వీరరాఘవులు 10వ వర్థంతి సభ శనివారం జరిగింది. ముందుగా రాఘవులు స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఐవి మాట్లాడుతూ రాఘవులు తన జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు కృషి చేశాడని, ప్రజల తరుపున పోరాడాడని తెలిపారు. రాఘవులు చేసిన పోరాటాలను, ఆ కృషిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చింతలగూడెం గ్రామ శాఖ కార్యదర్శి డేగల మురళి, రాఘవులు సతీమణి, వార్డు మెంబర్ కాటిబోయిన సునీత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వీరరాఘవులు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వినోద్ బాబు మాట్లాడుతూ అనుచిత వ్యాపార ప్రకటన పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 1986లో వినియోగదారుల రక్షణ చట్టం ప్రవేశపెట్టారని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని సూచించారు. వ్యాపారం నుండి మోసపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై ర్యాలీ

ప్రజాశక్తి-అనంతగిరి:జాతీయ వినియోగదారుల దినోత్సవం పురష్కరించుకుని మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలిక పాఠశాల నుంచి మూడు రోడ్ల కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. తహశీల్దార్ రాంబాయి, విద్యాశాఖ అధికారి ఎల్‌బి .వెంకటరావులు మాట్లాడుతూ, షాపులలో వినియోగ దారులు సరుకులు కొన్నప్పుడు నాణ్యత, తేదీ తప్పనిసరిగా చూసి కొనాలన్నారు. నాసిరకమైన వస్తువులు కొనరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ వై.పాత్రుడు పాల్గొన్నారు.



పాల డబ్బాలు పంపిణీ చేస్తున్న సురేంద్ర

పాల డబ్బాల పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండలంలోని చోంపి పంచాయతీ డేర్ని గ్రామానికి చెందిన గిరిజన బాలింత పెట్టేలి పద్మ అనారోగ్యంతో గత నెల 28న మరణించింది. ఆమెకు పుట్టిన నాలుగు నెలల చిన్నారి తల్లి పాలకు దూరమైంది. దీంతో యూనిటీ పర్ ఛారిటీ ట్రస్టు సభ్యులు శనివారం గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర చేతుల మీదుగా ఉచితంగా పాల డబ్బాలు పంపిణి చేశారు. పసిపాపకు రెండేళ్ల పాటు ప్రతీ నెలకు ఉచితంగా పాల డబ్బాలు ఉచితంగా అందిస్తామని చెప్పారు.పసి పాపకు చేయూతనిచ్చిన యూనిటీ ఫర్ చారిటి ట్రస్టు సభ్యులకు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నీలి నారాయణరావు, మేరీ జోస్ పిన్, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలో పోలిపుట్టు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో గిరిజనుడుకి గాయాలు అయ్యాయి. ముంచింగిపుట్టు మండలం రంగబయలు పంచాయతీ పట్నాపడాల్‌పుట్టు గ్రామానికి చెందిన కే.రాజు బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పడంతో గాయాల పాలయ్యాడు. బాధితుడిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించేందుకు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైస్ ఎంపీపీ 2 భాగ్యవతి హుటాహుటిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరామర్శించారు.మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైసీపీ నేతలు అప్పారావు, తిరుపతి, సాహూ, దేవా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గిరిజన ప్రాంతాల్లోని వయో వృద్ధులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వృద్ధ ఆశ్రమాలు నిర్వహించవలసిన అవసరం ఉందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. డుంబ్రిగుడ సచివాలయం వద్ద శనివారం మాతృభూమి సేవా సంఘం అధినేత ఇప్పలవలస గోపాలరావు ఆధ్వర్యంలో గిరిజన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ, గిరిజనులు వృద్ధాప్యంలో అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జిడి బాబు మాట్లాడుతూ, మాతృభూమి సేవా సంఘం గిరిజనులకు అండగా ఉండి ఇప్పటికే అనేక కార్యక్రమాలు నిర్వహించిందని, దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. సర్కిల్ పరిధిలో వందలాది మంది గిరిజన యువతను సేవా కార్యక్రమాల వైపు మరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డుబ్రిగుడ పోలీసు ఎస్సై సంతోష్ కుమార్, మాతృభూమి సేవా సంఘం నేత ఇప్పలవలస గోపాలరావు, ఎన్‌వివిఎన్ బ్లడ్ బ్యాంకు అధినేత టి నాగేశ్వరరావు, టి.మణికంత, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్

వెదురు కటింగ్ కార్మికులకు..

ఎఫ్ఎస్ఆర్ రేట్లు అమలు చేయాలి

ప్రజాశక్తి-చింతూరు

వెదురు కటింగ్ కార్మికులకు ఎఫ్ఎస్ఆర్ రేట్లు 2022-23 ప్రకారం కూలి రేట్లు అమలు చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. వెదురు కటింగ్ కార్మికులకు, లోడింగ్ కార్మికులకు, బాట పని కూలీలకు కూలీ రేట్లు పెంచాలని కోరారు. శనివారం గొడ్లగూడెంలో జరిగిన వెదురు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్మికుల పోరాట ఫలితంగా కూలీ రేట్లు పెంచుకోవడం జరుగుతుందన్నారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కూలీలతో పని చేయించుకుని ఎఫ్ఎస్ఆర్ రేట్లు అమలు చేయడంలో లోపం ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా ఈ సంవత్సరం వచ్చిన రెట్లను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు కూలిరేట్లు పెంచాలని, అప్పటి వరకు వెదురు కటింగ్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంగం జిల్లా నాయకులు సీసం సురేష్, మడకం చిన్నయ్య, లక్ష్మయ్య, కార్మికులు సింగయ్య, కాంతారావు, పాపారావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


మానవహారం చేపట్టిన విద్యార్థులు

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యవాణి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలిత గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి వినియోగదారుడా మేలుకో నీ హక్కులను కాపాడుకో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సత్యవాణి మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులను చట్టాలను గూర్చి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కులు చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది బాపన్నదొర, లోవ కుమారి, సత్తిబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పిఎంజె బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చినవాల్తేరు కోటక్ స్కూల్ వేదికగా మూడు రోజులు పాటు పిఎంజె బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్గనైజర్లు వేణుగోపాల్, వరుణ్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టోర్నీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

క్రిస్మస్ వేడుకలకు మన్యం సిద్ధం

చిన్నారులతో శాంతాక్లాజ్‌ల సందడి - ముస్తాబయిన చర్చిలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్:మన్యం వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు ప్రార్థన మందిరాలను సుందరంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే ముందస్తు, సెమీ క్రిస్మస్ సంబరాలు ఆయా ప్రాంతాల్లో జరుపుకుంటూ హ్యాపీ క్రిస్మస్ మెర్రీ క్రిస్మస్ అంటూ క్రీస్తును స్తుతిస్తూ గేయాలాపనలు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ అంటే క్రీస్తు ఆరాధన. ప్రేమామయుని జననాన్ని స్మరించుకుంటూ ఆరాధించడం క్రిస్మస్ పర్వదినం ప్రత్యేకత. విశ్వవ్యాప్తంగా డిసెంబర్ 25న క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు.

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని బాప్టిస్ట్ చర్చికి పురాతన చరిత్ర ఉంది. ఐటిడిఎ ఉద్యోగుల నివాస గృహాలకు సమీపంలో కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ (సిబిఎం) చర్చిని రెవరెండ్ విక్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో 1959లో నిర్మించారు. అప్పట్లో గిరిజన ప్రాంతంలో జీసస్ క్రైస్ట్ గుడ్ న్యూస్ ప్రచారాన్ని నిర్వహించేందుకు వచ్చిన కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ మిషనరీలు అదే సమయంలో చర్చిల నిర్మాణం కూడా చేపట్టారు. సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్ 1959లో ఈ ప్రాంతంలో పర్యటించి ప్రస్తుతం ఐటిడిఎ ఉద్యోగుల నివాస గృహాలకు సమీపంలో ఒక ఇంటిలో చర్చిని ఏర్పాటు చేశారు. తర్వాత 1970లో చర్చిని నిర్మించారు. ఈ ప్రాంతంలో ఇదే పురాతన చర్చిగా గుర్తింపు పొందింది. విక్టర్ జోసెఫ్ చనిపోవడంతో ఆయన కుమారుడు వెయిన్ ఎ జోసెఫ్ సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ గా కొనసాగుతున్నారు. చర్చిలోని విశ్వాసులే ఒక కమిటీగా ఏర్పడి, చర్చి నిర్వహణ చూస్తుంటారు. ప్రస్తుతం వల్లేసి చిన్ని, పాడి గ్లోరియస్ చర్చి నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. గత ఐదు రోజుల నుంచి క్రైస్తవ సోదరులు క్రిస్మస్ ఏర్పాట్లలో మునిగిపోయారు. చర్చిలలో ప్రత్యేక క్రిస్మస్ ఆరాధనలు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ ట్రీలను స్టార్లను చర్చి లలో పెద్ద పరిమాణంలో తయారుచేసి అలంకరించారు. క్రైస్తవ సోదరులు తమ గృహ



క్రిస్మస్‌కు సిద్ధమైన పాడేరులోని పురాతన సిబిఎం చర్చి

ప్రాంగణాల్లోనూ క్రిస్మస్ స్టాల్‌లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం చర్చల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం పురవీధుల్లో వివిధ చర్చిల సంఘస్తులు క్రిస్మస్ తాత వేషధారణతో క్రైస్తవ కీర్తనలను ఆలాపిస్తూ క్యారల్స్ సందడిగా నిర్వహించారు. ఇంటికి వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్చించాలి

గిరిజన సంఘం డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో మైదాన ప్రాంత గిరిజనేతరులు అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు, షాపుల తొలగింపుపై సర్వసభ్య సమావేశంలో చర్చించి తీర్మానించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్సులు కిల్లో రామారావు, తాపుల కృష్ణా రావులు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ, మండల కేంద్రంలో గిరిజ నేతరులు అక్రమంగా బినామీ పేర్లతో ఇల్లు, షాపులు కడుతుంటే అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం, గిరిజన ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. దీంతోనే అక్రమ నిర్మాణాలు జరుతు న్నాయన్నారు. గిరిజన చట్టాలు, హక్కులకు తూట్లు పొడుస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం బాధాకరమన్నారు. ఇప్పటికే మండల కేంద్రంలో చాలా వరకు భూమిని గిరిజనేతరులకు అప్పజెప్పారన్నారు. ఇలాగే వదిలేస్తే భవిష్యత్‌లో గిరిజన జాతికి సెంటు భూమి కూడా మండల కేంద్రంలో ఉండదన్నారు ఇప్పటి వరకు గిరిజనేతరులపై ఒక్క ఎల్టీఆర్ కేసు కూడా నమోదు చేయక పోవడం ఇందుకు నిదర్శనం అన్నారు. గిరిజనేతరులు పీసా, 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీలో ఇల్లు, షాపులు, స్థిర నివాసం కలిగి ఉండకూడదని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్, ప్రభుత్వం, అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తమార్బ అప్పల కొండ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధత ఏదీ

ప్రజల్లో నాలుగో దశ కోవిడ్ భయం
వ్యాక్సిన్ నిల్వలు లేవు
సరిపడా లేని మందులు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కోవిడ్ నాలుగో దశ (ఒమిక్రాన్ బిఎఫ్-7) మొదలవుతుందన్న ప్రజల ఆందోళనకు తగినట్లు ప్రభుత్వ సన్నద్ధత కనిపించడంలేదు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందులు కాస్త ఉన్నప్పటికీ, ఇమ్యునైజేషన్ కార్యాలయంలో వ్యాక్సిన్ నిల్వలు ఒక్క డోస్ కూడా లేదు. గతంలో ఆయా ఆసుపత్రులకు సరఫరా చేసిన వ్యాక్సిన్ల నిల్వలు అక్కడక్కడ ఉండడం తప్ప, అవసరమైతే ఆసుపత్రులకు సరఫరా చేసేందుకు ఒక్క డోస్ కూడా నిల్వ లేని పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితమే వ్యాక్సిన్ నిల్వలు అయిపోయినప్పటికీ ప్రభుత్వం సరఫరా చేయలేదు. నాలుగో దశ కోవిడ్ భయంతో ఒకటి, రెండు దశల వ్యాక్సిన్ వేసుకోవాలన్నా, బూస్టర్ డోస్ తీసుకోవాలన్నా వేయగలిగిన పరిస్థితి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో లేదు. కోవాగ్జిన్, కొవిషీల్డ్ వ్యాక్సిన్లు లేని విషయాన్ని కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇంకా రాలేదు. ప్రభుత్వాధికారుల గణాంకాల ప్రకారం కోవిడ్ టీకా మొదటి దశ రాష్ట్ర లక్ష్యానికి మించి జిల్లాలో జరిగింది. రాష్ట్ర లక్ష్యం 31,73,268 కాగా, జిల్లాలో 31,74,619 మందికి తొలిదశ టీకాలు వేశారు. రెండో డోసు వేసుకున్నవారి సంఖ్య 33,48,124గా ఉన్నట్లు చెబుతున్నారు. బూస్టర్ డోస్‌లు 12,18,891 మంది వేసుకున్నారు. ఇప్పుడు ఏ దశ టీకా వేసుకుందామన్నా నిల్వలు లేవు.

సర్జికల్ మాస్కులు 8.50 లక్షల వరకు తెప్పించారు. ఆర్‌టిపిసిఆర్ కిట్స్ కూడా సరిపడా లేకపోవడంతో అనుమానితులందరికీ పరీక్షలు చేయడంలేదు. విమానాశ్రయంలో ర్యాండమ్‌గా ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి నుంచి కేసులు పెరిగే అవకాశముందని వైద్యశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందు షాపింగ్, పండగకు వేర్వేరు ప్రాంతాల నుంచి జరిగే రాకపోకలతో కేసులు పెరగనున్నాయని చెబుతున్నారు. కోవిడ్‌కు సంబంధించి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో కోవిడ్ సంబంధిత మందులు, కిట్లు పరిమితంగా వున్నాయి. ఇవి కూడా గతంలో సరఫరా చేసిన వాటిలో మిగిలినవి తప్ప కొత్తగా ప్రభుత్వం మందులు పంపించలేదు. కేసులు పెరిగితే ఇవి కూడా ఏ మూలకూ సరిపోవు. రెమిడిసివిర్ ఇంజక్షన్లు 13 వేలకు పైగా వున్నాయి. టొసిలిజుమాబ్ 80 ఎంజి ఇంజక్షన్లు 20, యామ్‌ఫోటెరిసిన్ - బి50 ఎంజి ఇంజక్షన్లు 2869, పొసకోనాజోల్ ఇంజక్షన్లు 3833, హ్యూమన్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ 5 జిఎం 287 ఉన్నట్లు తెలిసింది. విటిఎంఎస్ లక్షా 70 వేలకుపైగా వున్నాయి. గ్లౌవ్స్ దాదాపు 13 లక్షల వరకు ఉన్నాయి. పిపిఇ కిట్స్ 22 వేలు, ఎన్ 97 మాస్కులు మూడు లక్షలకు పైగా వున్నాయి. 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్స్ 280, ఐదు లీటర్ల ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్స్ 90, బి టైప్ ఆక్సిజన్ సిలిండర్స్ నాలుగు వేలు, డి టైప్ ఆక్సిజన్ సిలిండర్స్ 1800 వరకు ఉన్నాయి. బారిసిటినిబ్ 4ఎంజి మాత్రలు 200, ఫాబిపిరవిర్ 200 ఎంజి క్యాప్సుల్స్ రెండు వేలు, హోమ్ ఐసోలేషన్ కిట్స్ 45 వేల వరకు ఉన్నాయి.

మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెరియార్ రామస్వామి ఆశయాల మేరకు మూఢ నమ్మకాల నిర్మూలన చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు తుంపాల శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. ప్రముఖ నాస్తిక ఉద్యమకారుడు పెరియార్ ఇవి.రామస్వామి 49వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆర్‌కె.బీచ్ వైఎంసిఎ ఎదురుగాగల ఆయన విగ్రహం వద్ద పెరియార్ ఆశయ సాధన సంఘం, భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం జీవితాంతం పెరియార్ పోరాడారని తెలిపారు. అలాగే పెళ్లిళ్లలో అర్థంలేని మంత్రాలు, సాంప్రదాయాల పేరుతో వృథా ఖర్చులు తగ్గించడం కోసం దండల పెళ్లిళ్లు, వితంతు వివాహాలను ప్రోత్సహించారని గుర్తుచేశారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, భానాస జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, డి.విజ్ఞానంద్, రాంప్రభు, ఎస్.అజయ్, సుధాకర్, ఎస్ఆర్.వేమన, ప్రసాదరావు, వి.శ్రీనివాసరావు, హరిబాబు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో..

సిపిఐ ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పెరియార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు.

20, 21 తేదీల్లో ఇన్ఫినిటీ వైజాగ్ ఐటి సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఐటి వ్యవస్థను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా వచ్చే ఏడాది జనవరి 20, 21 తేదీలలో విశాఖపట్నంలోని మారియట్ హోటల్లో ఇన్ఫినిటీ వైజాగ్ - 2023 పేరుతో ఐటప్ ఆధ్వర్యంలో ఐటి సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని ఐటిఎఏపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ కొసరాజు తెలిపారు. శనివారం సాయంత్రం ద్వారకానగర్‌లోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మిట్ వివరాలను తెలియజేశారు. సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నామని, విశాఖ నగరంలో పెట్టుబడులు, అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఈ సమ్మిట్ ద్వారా తెలియజేస్తామని అన్నారు. ఐటి రంగం స్టార్టప్‌లతో పాటు దేశంలోని వివిధ పరిశ్రమల అనుబంధ సంస్థలు, ఎంఎన్‌సి కంపెనీల నుంచి ఐటి ప్రముఖులు తరలివచ్చి ప్రసంగిస్తారని తెలిపారు. ఐటి, ఐటిఇఎస్ పరిశ్రమలకు చెందిన నిపుణులు కోర్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఆటోమేషన్, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0లో ఎఐ గురించి వివిధ ప్యానెల్స్‌లో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి, రైల్వేలు, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భాగస్వాములుగా ఉంటారన్నారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పాల్గొంటారన్నారు.

నేరాలు ఘోరాలు

పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని చింతల అగ్రహారంలో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పెంకుటిల్లు దగ్ధమైంది. బాధితుడు కడియం కనకరాజు కథనం ప్రకారం... ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తలెత్తి దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో బంగారం, వెండితోపాటు రూ.3.50 లక్షలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మాయి రజస్వల వేడుకల కోసం నగదు, ఏడు తులాల బంగారం, 50 తుల వెండి తెచ్చి ఇంట్లో దాచుకున్నట్లు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల మొత్తం కోల్పోయామని కనకరాజు కుటుంబం కన్నీరు మున్నీరైంది.

ఉద్యోగాల పేరిట మోసగించిన నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : ఆర్మీ ఉద్యోగం పేరిట మోసం చేసిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... మధురవాడ బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీకి చెందిన నర్వ శివాజీ, చోడవరం ప్రాంతానికి చెందిన తీగల సత్య శ్రీనివాస్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కోడూరు శ్రీనివాస్, ధవళ ప్రసాద్‌కుమార్ తదితరులు ముఠాగా ఏర్పడి నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి సుమారు రూ.60 లక్షలు వసూలు చేశారు. మారికవలసకు చెందిన హరీష్ కొంత నగదు ఇచ్చాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో అతడు పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సిఐ రామకృష్ణ కేసు నమోదుచేసి విచారించారు. నిందితులను అరెసుటచేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా నరసింహారావు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగ ఆచార్యులు ఎ.నరసింహారావు నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నియామక ఉత్తర్వులను నరసింహారావుకు అందజేశారు. అనంతరం ఆచార్య నరసింహారావు ప్రిన్సిపల్‌గా బాధ్యతలను చేపట్టారు. గతంలో ఆచార్య నరసింహారావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులకు విసి అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఏయూ పరిధిలోని ఆదిత్య కళాశాల నుంచి పి.రమ్య, ఏయూ ఫార్మశీ కళాశాల నుంచి జె.వాసు, స్పెసెస్ డిగ్రీ కళాశాల నుంచి వివిఎస్ఎన్.లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సిసిఆర్‌టి), డైట్ సంయుక్తంగా పలు అంశాలపై నిర్వహించిన వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెలుగులోనికి రాని చారిత్రక అంశాలు, సంస్కృతి సంప్రదాయాలు, స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను డిజిటల్ రూపంలో రూపొందించేందుకు ఏర్పాటుచేసిన వర్క్ షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులకు ఆర్‌పిలు శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు పాల్గొన్న వారిని అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, సిసిఆర్‌టి కన్సల్టెంట్ వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో పోస్టుల భర్తీ ఫీజులను తగ్గించాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నిర్ణయించిన పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచరపాలెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలకు ఒక పోస్టుకు రూ.2,300 పరీక్ష ఫీజు పెట్టడం దారుణమన్నారు. పరీక్ష నిర్వహణ పేరిట భారీ ఎత్తున ఫీజు వసూలుచేయడం నిరుద్యోగులను లూటీ చేయటమేనని విమర్శించారు.


కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలిస్తున్న అధికారులు

1341 టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1341 టన్నుల ధాన్యాన్ని రైతులు వద్ద నుండి కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. శనివారం ఏఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జడ్డంగి రైతు భరోసా కేంద్రంలో అత్యధికంగా 54 టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రాజవొమ్మంగిలో 376 టన్నులు, లబ్బర్తిలో 162 టన్నులు దూసరపాములో 121 టన్నులు, కొమరాపురంలో 92 టన్నులు, శరభవరంలో 86 టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని సుమారు 80 మంది రైతుల ఖాతాలో రూ.72 లక్షలు జమ చేయడం జరిగిందని చెప్పారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు ఆన్లైన్లో నమోదు చేసిన 21 రోజుల్లో రైతులు ఖాతాలో ధాన్యానికి సంబంధించిన డబ్బులు జమ కాపడతాయని ఏవో తెలిపారు.

ఎంపిపి కారం లక్ష్మి క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండల ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు, క్రైస్తవ సోదరులకు సిపిఎం ఎంపిపి కారం లక్ష్మి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ ఏడాది వరదలు కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని నిత్యవసర ధరలు పెరుగుదలతో పండగ జరుపుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సగటు పేదలు ఇళ్లల్లో పండుగ సంతోషంగా జరుపుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల జీవితాలతో వెలుగులు నింపాలంటే నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

సిపిఎం మండల కమిటీ శుభాకాంక్షలు

మండలం, రేఖపల్లి పంచాయతీ పరిధిలోని క్రైస్తవులకు సర్పంచ్ పూనెం సరోజినీ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు భిన్నత్వంలో ఏకత్వంవలే ఆదర్శనీయమని కొనియాడారు.

632వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా నిర్వహిస్తున్న ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 632వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ఉండగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఏర్పాటైందని, ఈ కర్మాగారం రావడంతో విశాఖపట్నం స్టీల్ సిటీగా గుర్తింపు పొందిందని అన్నారు. ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించిందన్నారు. లాభాల్లో నడుస్తున్న ఈ కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం కోసం మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.నర్సింగ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తాతబాబు, ఉపాధ్యక్షులు పి.వెంకట అప్పారావు, అగస్తియన్, పివి.రమణ, ఇ.నాగేశ్వరరావు, కెఎస్.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 2023వ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంవి.ప్రసాదరావు మాట్లాడుతూ కెవిపిఎస్ కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు.